క్లుప్తంగా

స్పందించిన అధికారులు



సాక్షి ఎఫెక్ట్..

శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని కోయిల్‌దిన్నె ప్రధాన రహదారి అధ్వానంగా మారి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వరుస కథనాలకు ఎట్టకేలకు జిల్లా యంత్రాంగం స్పందించింది. కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీరాజ్‌శాఖ డీఈ, ఏఈ బుధవారం రోడ్డు కొలతలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు, ప్రయాణికులు 'సాక్షి'కి, కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



రాజోళి: పొలం పనులు చేస్తూ గుండెపోటుతో మృతి చెందిన రైతు కుటుంబాన్ని అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు బుధవారం పరామర్శించారు. మండలంలోని పచ్చర్లకు చెందిన రైతు స్వామిదాసు(55) మంగళవారం పొలం పనులు చేస్తు గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బుధవారం ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో శ్రీనువాసులు, పరమేష్ నాయుడు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

కేటీదొడ్డి: విధి నిర్వహణలో ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈఓ వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని గంగన్‌పల్లి, ఈర్లబండ పాఠశాలలో బుధవారం ఎంఈఓ ఆకస్మిక తనిఖీ చేశారు. మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీ పాపయ్య, హెచ్ఎం చంద్రశేఖర్‌రెడ్డి, నర్సింహులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

18న ఇంటర్వ్యూలు

ధరూరు: మండల కేంద్రంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి ఈ నెల 18వ తేదీన డెమో, ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ హెస్సేనప్ప బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కామర్స్ సబ్జెక్టుకు సంబంధించి బోధించేందుకు పీహెచ్‌డీ, నెట్, సెట్‌తో పాటు గురుకులంలో పని చేసిన వారి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హులైన వారు 18న ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్లతో హాజరు కావాలని పేర్కొన్నారు.

సామ్రాజ్యవాద ఒప్పందంపై ఆగ్రహం

గద్వాల: కేంద్ర ప్రభుత్వం అమెరికా ద్వైపాక్షిక చర్చలు జరిపి ట్రంప్ ప్రభుత్వానికి లొంగే ప్రమాదముందని దీనిని నిరసిస్తూ సామాజ్యవాద ఒప్పంద పత్రాలు దగ్ధం చేసినట్లు సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గోపాల్, నర్సింహ, వెంకటస్వామి, నాగరాజు, ప్రభాకర్, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

పొదుపుపై అవగాహన ఉండాలి



అలంపూర్: విద్యార్థులకు పొదుపుపై అవగాహన ఉండాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ రవికుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ వర్క్‌షాప్ బుధవారం నిర్వహించారు. ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, కేవైసీ, నామినీ, డీఐసీజీసీ, విద్యాలక్ష్మి, ఉద్గం పోర్టల్ గురించి వివరించారు. బ్యాంక్ ఖాతాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్ అంజనేయులు, ప్రాజెక్ట్ మేనేజర్ అశోక్‌కుమార్, కళాశాల ఇన్‌చార్జ్ రాజు, అధ్యాపకులు రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరత

- ముందుకు సాగని నిర్మాణ పనులు
- ఉచితంగా అందించాలంటున్న లబ్ధిదారులు
- అధిక ధరలతో లబ్ధిదారులపై భారం



చెన్నిపాడులో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లు

మానవపాడు: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నత్తనడకన కొనసాగుతున్నాయి. ఇసుక కొరతతో ఇళ్ల నిర్మాణం ముందుకు సాగడం లేదు. ప్రభుత్వం లబ్ధిదారులకు ఇసుకను ఉచితంగా ఇవ్వాలని అధికారులను ఆదేశించినా మండలంలో ఇసుక రీచ్‌లు లేకపోవడంతో సీఎం ఆదేశాలు అమలుకావడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇసుక అనుమతి కోసం టోకెన్లు ఇవ్వాలంటే మండలంలో ఇసుక రీచ్‌లు లేక ఇబ్బందులు తప్పడం లేదు.

రూ.6,000 వరకు వసూలు

ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభానికి ముందు పక్క మండలాల నుంచి ట్రాక్టర్ ఇసుక రూ.2500 నుంచి రూ.3వేలకు విక్రయించేవారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం తరువాత ఇసుక అక్రమంగా తరలించేందుకు రూ.5,000 నుంచి రూ.6,000 వరకు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదేనుగా భావించిన దళారులు అధిక ధరలకు విక్రయిస్తూ కాసులు దండుకుంటున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.

329 ఇళ్లు మంజూరు

మండలంలో మొదటి విడుతగా 329 ఇళ్లు మంజూరయ్యాయి. 220 ఇళ్లకు ముగ్గులు పోశారు. మండలంలోని చంద్రశేఖర్‌నగర్ గ్రామంలో పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసి 115 ఇళ్లు మంజూరు చేశారు. వీటిలో 43 ఇళ్లు నిర్మాణంలో ఉండగా, 72 మంది లబ్ధిదారులు ఇళ్లు వద్దని చెప్పడంతో రద్దు చేశారు. ఇళ్ల నిర్మాణం ప్రారంభించినప్పటి నుంచి ఇసుక మొదలుకొని సిమెంట్, స్టీలు, మేస్త్రీల రేటు, కూలీలు ఇలా అన్నింటికి ధరలు పెరగటంతో ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షలతో ఇల్లు నిర్మాణం పూర్తయ్యేనా అంటూ లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇసుక, స్టీల్, ఇతర సామాగ్రి ధరలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఇసుక సమస్య పరిష్కరిస్తాం

ఇసుక కొరతతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నా మాట వాస్తవమే. జిల్లా అధికారులు త్వరలోనే ఇసుక సమస్యను పరిష్కారం చేస్తామన్నారు. మండలంలో ఒక చోటా ఇసుక డంప్‌చేసి ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక ఇబ్బందులు లేకుండా చేస్తాం.

– రాఘువ, ఎంపీడీఓ, మానవపాడు

ధరలు పెరిగాయి..



ఇళ్ల నిర్మాణానికి అవసరమయ్యే అన్ని రకాల సామాగ్రి ధరలు పెరిగాయి. ఇసుక, కంకర, సిమెంట ధరలతో పాటు మేస్త్రీల ధరలు కుడా పెరిగాయి. టిప్పర్ ఇసుక రూ.25 వేల నుంచి రూ. 27వేల వరకు వసూలు చేస్తున్నారు. అధికారులు స్పందించి ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

– శాంతన్న, చెన్నిపాడు, లబ్ధిదారుడు

ఇసుక ఉచితంగా ఇవ్వాలి..



ఇందిరమ్మ పథకం కింద ఇల్లు మంజూరు చేయడం సంతోషంగా ఉంది. ఇల్లు కట్టేందుకు ఉపయోగించే సామగ్రి ధరలు అమాంతం పెరిగాయి. ఈ పథకం కింద ప్రభుత్వం ఇస్తున్న రూ. 5 లక్షలూ ఎటూ సరిపోయేట్టు లేవు. ఉచితంగా ఇసుక సరఫరా చేసి, ఇతర సామగ్రి ధరలు తగ్గించాలి. లబ్ధిదారులుకు అందుబాటులో ఉంచాలి.

– ఎస్తేరమ్మ, లబ్ధిదారు, చంద్రశేఖర్‌నగర్

రాష్ట్ర ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు

శాంతినగర్: విద్యారంగాన్ని బలోపేతం చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీంపాష అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ బోధన కళాశాలలో బుధవారం పీడీఎస్‌యూ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సమస్యలను వారితో పేర్కొన్నారు. అనంతరం హలీంపాష మాట్లాడుతూ.. ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు భిన్నంగా పాలన కొనసాగిస్తుందన్నారు. ఎన్నికల ముందు విద్యారంగానికి అనేక హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నేడు ప్రభుత్వ విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు.



సమస్యలు వివరిస్తున్న విద్యార్థులు

ప్రైవేట్ విద్యా సంస్థల్లో రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయకపోవడం దారుణమన్నారు. అనుమతులు లేకుండా నడుపుతున్న పాఠశాలలపై చర్యలు చేపట్టాలన్నారు. విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ఉండవెల్లి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆర్డీఓ అలివేలు అన్నారు. మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలను ఆర్డీఓ బుధవారం ఆకస్మికంగా తనఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంట గదిలో కుళ్లిన కూరగాయాలను ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ తప్పక పాటించాలని సూచించారు. మూత్రశాలలను, తరగతి గదులను, విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రభాకర్, ఆర్ఐ నాగరాజు, ప్రిన్సిపాల్ ఎలిజబిత్ సుహాసిని తదితరలుఉ పాల్గొన్నారు.



భోజనాన్ని పరిశీలిస్తున ఆర్డీఓ అలివేలు

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



గట్టు: సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మాచర్ల గ్రామీణ వికాస్ బ్యాంకు అధికారి వికాస్ అన్నారు. బుధవారం మాచర్ల గ్రామంలో జన సురక్ష క్యాంప్ నిర్వహించారు. పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై, ఏపీవై బీమా చేయించుకోవాలని ఖాతాదారులకు సూచించారు. అపరిచిత వ్యక్తులకు బ్యాంకు ఖాతా వివరాలను ఎట్టి పరిస్థితుల్లో తెలియజేయవద్దన్నారు. సైబర్ నేరాల బారిన పడిన వారు 1930ను సంప్రదించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌టీ కౌన్సిలర్ అనూష, ప్రకాష్, వీరేష్, చాంద్‌బాష తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఓసీ అందజేత

అలంపూర్: కర్నూలులోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్ఓసీని ఎమ్మెల్యే విజయుడు లబ్ధిదారులకు బుధవారం అందజేశారు. అయిజ మండలం సింధనూరు గ్రామానికి వైద్య చికిత్స నిమిత్తం రూ.4 లక్షల ఎల్ఓసీ మంజూరైనట్లు పేర్కొన్నారు.

లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మల్దకల్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిలిచిన వర్షపు నీరు



అయిజ బుడుగజంగం కాలనీలో లోతట్టు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అయిజ: మున్సిపాలిటీలోని లోతట్టు ప్రాంతాలను బుధవారం మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు, ఏఈ రాజశేఖర్ పరిశీలించారు. మున్సిపల్ సిబ్బందితో కలిసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసర ప్రాంతాలతో పాటు బుడుగజంగాల కాలనీ, గాజులపేట కాలనీలను పరిశీలించారు. నాలుగు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, లోతట్టు కాలనీలు మునిగిపోయే ప్రమాదం ఉందన్నారు. అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీరు నిల్వకుండా చర్యలు

శాంతినగర్: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో డ్రెయినేజీల్లో నీరు నిల్వకుండా మున్సిపల్ సిబ్బంది బుధవారం చర్యలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ రాజయ్య ఆదేశాల మేరకు శాంతినగర్‌లోని జమ్ములమడుగు, రామచంద్రానగర్ కాలనీల్లో డ్రెయినేజీలు, పల్లపు ప్రాంతాల్లో నిలిచిన వర్షపు నీటిని తొలగించారు.

వర్షపునీటితో అవస్థలు

మల్దకల్: మండల కేంద్రంలోని తహసీల్దార్ ఎంపీడీఓ కార్యాలయాల ఆవరణలో బుధవారం వర్షపు నీరు నిలవడంతో చెరువును తలపిస్తుంది. వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పంపిణీ

మల్దకల్: పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులతో పశువుల యజమానులు అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి ఉషా అన్నారు. బుధవారం మండలంలోని పాల్వాయి గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..లంపీస్కిన్, గర్బకోశవ్యాధి తదితర వ్యాధులపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తప్పనిసరిగా టీకాలు వేయించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

అలంపూర్ రూరల్: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ పద్మావతి అన్నారు. మండల పరిధిలోని క్యాతూర్ గ్రామంలో బుధవారం ఎంపీడీఓ పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మురుగు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు.

సురక్షిత ప్రాంతాలకు తరలింపు

అలంపూర్ రూరల్: మండల పరిధిలో మట్టిమిద్దెల్లో ఉంటున్న 8 కుటుంబాలను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు ఎంపీడీఓ తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.



క్యాతూర్‌లో పరిశీలిస్తున్న ఎంపీడీఓ పద్మావతి

సమస్యలపై పాలకులు దృష్టి పెట్టాలి



అయిజలో నీట మునిగిన కాలనీని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు



గద్వాలలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అయిజ: అలంపూర్ నియోజకవర్గంలోని ప్రజల సమస్యలు పరిష్కరించకుండా పాలకులు హైదరబాద్, కర్నూలులో మకాం ఉంటున్నారని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆరోపించారు. బుధవారం పట్టణంలో నీట మునిగిన గాజులపేట కాలనీని బీజేపీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో మాత్రమే నియోజకవర్గ ప్రజలు మీకు అవసరమా అని ప్రశ్నించారు. రోడ్లు బ్రిడ్జిలు పూర్తిగా శిథిలమయ్యాయని, సీడ్‌పత్తి రైతులు సమస్యల వలయంలో ఉన్నారన్నారు. 100 పడకల ఆస్పత్రిలో అరకొర వైద్యానికే పరిమితమయ్యిందన్నారు. హైదరాబాద్, కర్నూలులో గడిపే సమయంలో కనీసం 10 శాతం సమయం అలంపూర్ నియోజకవర్గంలో గడపరా అని ఎద్దేవా చేశారు. స్థానిక ఎన్నికల్లో ప్రజల ఆగ్రహం చవి చూస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు భగత్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్, నాగరాజు, నరసింహులు, రఘు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పాలకులకు పట్టని సమస్యలు

గద్వాలటౌన్: మండలంలో అనేక సమస్యలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయని, వాటిని పరిష్కరించడంలో పాలకులు విఫలమయ్యారని బీజేపీ నాయకులు శ్రీనివాసులు, శివారెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. రహదారులు అస్తవ్యస్తంగా ఉన్న ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గ్రామాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కరువయ్యాయని వాపోయారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అక్కల రమాదేవి, మధుసూదన్‌రెడ్డి, రామకృష్ణ, రఘు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలి

అలంపూర్: మున్సిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలని మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గట్టన్న, గౌరవ అధ్యక్షుడు వెంకటస్వామి పిలుపునిచ్చారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులతో బుధవారం సమావేశం నిర్వహించారు. కార్మికుల సమస్యలపై చర్చించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. రెండేళ్లకు ఒకసారి మున్సిపల్ కార్మికుల మహాసభలు జరగనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలో మున్సిపల్ కార్మికులు రెండేళ్లలో చేసిన పోరాటాలను సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. మున్సిపాలిటీలో నాలుగు నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులను కార్మికుల ఖాతాలో జమ చేయాలని కోరారు. కార్మికులను క్రమబద్ధీకరించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ఈ నెల 16న మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా మహాసభలు జిల్లా కేంద్రంలోని బృందావన్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు ఏమెలమ్మ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఈదన్న, సీపీఎం నాయకులు వెంకటస్వామి, లక్ష్మీదేవమ్మ, నాగశేషమ్మ, లక్ష్మన్న, రమేష్, జవాన్ సామేలు, వెంకటేశ్, మునిస్వామి, ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు గట్టన్న

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం



అలంపూర్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంఈఓ అశోక్‌కుమార్



జిల్లా కేంద్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

గద్వాలటౌన్: డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేయాలని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ కలందర్‌బాషా అన్నారు. 'నషా ముక్త్ భారత్ అభియాన్' 5వ వార్షికోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం కళాశాల ఆవరణలో 'మాదక ద్రవ్యాల వినియోగ వ్యతిరేక' ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. సమాజంపై మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరిస్తూ ప్రజల్లో అవగాహన తీసుకురావాలని సూచించారు. డ్రగ్స్ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత డ్రగ్స్ బారినపడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చంద్రమోహన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సురేందర్‌రెడ్డి, అధ్యాపకులు సత్యన్న, పద్మ, సత్యమ్మ, భాస్కర్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి

అలంపూర్: డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేద్దామని ఎంఈఓ అశోక్‌కుమార్ అన్నారు. పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ న్యూప్లాట్స్‌లో డ్రగ్స్ నిర్మూలనపై ఎంఈఓ బుధవారం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి ఒక్కరూ డ్రగ్స్ రహిత జీవన శైలిని అనుసరించాలన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణ సంకల్పంలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు.

ప్రతి ఇంటిపై జెండా రెపరెపలాడాలి

గద్వాలటౌన్/శాంతినగర్/కేటీదొడ్డి/గట్టు/ఎర్రవల్లి: స్వాతంత్ర్య దినోత్సవ వేళ ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తిని చాటాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యార్థులతో కలసి బీజేపీ నాయకులు జిల్లా కేంద్రంలో జాతీయ జెండాను ప్రదర్శిస్తూ ర్యాలీ చేశారు. స్థానిక రాజీవ్ సర్కిల్‌లో సామూహిక ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య కోసం పోరాడిన మహనీయులను గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, శ్యామ్‌రావు, మధుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

✡ ప్రతి భారతీయుడి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు రాజగోపాల్ అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో విశ్వహిందూ పరిషత్, బీజేపీ మండల అధ్యక్షుడు రామకృష్ణ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్, విశ్వహిందూపరిషత్ సభ్యులు వెంకటేశ్వర్లు, హోటల్ మహేష్, విజయ్, మురళి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

✡ కేటీదొడ్డి మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిర్వహించారు. ప్రతి ఇంటిపై ఈనెల 13, 14, 15వ తేదీల్లో జాతీయ జెండాను ఎగురవేయాలని సూచించారు.



గద్వాలలో జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ చేస్తున్న బీజేపీ నాయకులు

కార్యక్రమంలో భీమ్‌రెడ్డి, నాగిరెడ్డి, అంపిరెడ్డి, రాములు, వీరన్న, కృష్ణకాంత్, పాల్గొన్నారు.

✡ గట్టులో బీజేపీ మండల అధ్యక్షుడు గూడురు నాగప్ప ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా బైక్ ర్యాలీని నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బల్గెర శివారెడ్డి, ప్రభాకర్, హనిమిరెడ్డి, మాచర్ల సురేష్, మొద్దు సంజీవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

✡ బీజేపీ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు దేవదాస్, బీజేపీ మండలాధ్యక్ష్యుడు జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎర్రవల్లి మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి పలు సమస్యలతో కూడిన వినతిపత్రం బైక్‌గా ర్యాలీగా వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో షేక్ అబ్బులా, కిషోర్, నరసింహులు, విజయ్, పరుశరాం, బీసన్న, సుబ్బారెడ్డి, నరేష్ పాల్గొన్నారు.



ఎర్రవల్లిలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



శాంతినగర్‌లో బైక్ ర్యాలీ..



కేటీదొడ్డిలో బైక్ ర్యాలీలో నాయకులు